# ముల్లా కథలు ★

రచన :
• పొట్లపల్లి రామారావు •

ముల్లాగడ్డం చాలాపొడవుగా ఉండేది. ఆయన దాన్ని ఎంతో మురిపంగా పెంచుకున్నాడు. ఆయన ఒంటరిగా ఉన్నా, నలుగురు పరిచయస్థుల మధ్య కూర్చున్నా, ఎప్పుడూ చేతితో గడ్డాన్ని తడువుతూ తన ఘనత చాటుతుండేవాడు.

ఒకరోజు ఏదో పుస్తకం చదువుతుండగా "ఎవడి గడ్డమైతే పొడువుగా, తలనిడుపుగా ఉంటుందో వాడు తెలివి తక్కువవాడుగా ఉంటాడు" అనే వాక్యం అతనికళ్ళ పడింది. వెంటనే లేచిపోయి అద్దంలో తనముఖం చూచుకున్నాడు ముల్లా. అక్షరాలా ఆతనితల, ఆతనిగడ్డం, పుస్తకంలో నిరూపించినట్టుగానే ఉన్నాయి. ముల్లాకు పిచ్చి ఎత్తినట్లు అయింది.

"అయ్యో! ఇన్నాళ్లు అజ్ఞానంలో గడిచిపోయే గదా" అనే చింత, చింతతోపాటు "ఇప్పుడు ఏమి చేయాలె" అనే ఆరాటం ఆతనిలో ఒకేసారి బయలుదేరినాయి. ఏమైనా కానీయి - యిక ఈ గడ్డాన్ని మాత్రము ఒక్కనిమిషం ప్రాణాలతో ఉండనీయగూడదు-దీనికి వెంబడే స్వస్తి చెప్పాలంటూ ఆ ఆవేశములో ఏమీ తెలియక గడ్డాన్ని చేతితో పట్టుకొని ఎదురుగాఉన్న దీపానికి అంటించాడు. దీపశిఖలు వేళకోసరం పొంచి చూస్తున్నట్టుగా గప్పున ఎగిసి ముఖమంతా చుట్టుకొన్నాయి.

పాపం! ముల్లా ముఖమంతా ఆవేడి సెగలతో బొబ్బలెక్కిపోయింది. ఆగాయాలతో ఎన్నోరోజులు బాధపడ్డాడు ముల్లా.

తరవాత కొద్దిరోజులకు తాను చదివిన పుస్తకం కంటపడ్డది. అప్పుడు ఆ పుస్తకాన్ని తీసుకొని "నేను చదివిన విషయం అనుభవం అని ఋజువు చేశాను" అని తాను చదివిన వాక్యం ప్రక్కనే రాసి ఓనిట్టూర్పు తీసాడు.

ముల్లాయుక్తి:—

ముల్లా తాను సంపాదించే ధనమంతా, ఎక్కడ భద్రపరచాలని, చాలరోజులు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అతనికి ఏమీ తోచలేదు. ఏ ధనికునివద్ద దాచి ఉంచుదామన్నా, అతనికి మనుషులపైన నమ్మిక ఉండకపొయ్యేది. ఆలోచించగా ఆలోచించగా, ఆతనికోయుక్తి తోచింది. ఏ శిథిల భవనములోనైనా పాతిపేస్తే ఏభయమూ ఉండదని ఆతనికి తట్టింది.

"సరే" అనుకున్నాడు.

ఇక ఆరోజునుండి తాను చేసుకున్న నిర్ణయ ప్రకారం తనకు లభించిన ధనమంతా సరిగా లెక్కించుకొని, ఊరిబయిటి ఓశిథిల భవనంలో, వోమూల గోయితీసి, దాంట్లో వేయడం ఆరంభించాడు. ఆ శిథిలభవనం ప్రక్క వో అత్తరవు వర్తకుడు ఉంటూ వుండేవాడు. ముల్లా ప్రతినిత్యం ఆ శిథిల గృహంలోకి వస్తూ పోతూ ఉండటం చూచి ఆతనికి అనుమానమేసింది.




షెలెట్ క్విక్ రిట్

నిబ్బుకాగితానికి తాకగానే వ్రాయు స్వదేశీ సిరాలలో ఇది శ్రేష్ఠమైనది. ఈ పేరు గ్యారంటీ సూచించును. ఫౌంటన్ పెన్ కు క్విక్ రిట్ వాడుడు.

తయారుచేయువారు:— షెలెట్ బ్రదర్సు

8, లక్ష్మదాస్ వీధి, పి. టి. మద్రాస్

"ఏమి అబ్బా...వీడికి...ఈ కూలిన యింట్లో ఏమిపని—వీడేదో నలుగురికి తెలియరాని పని చేస్తున్నాడు" అనుకొని ఒకరోజు ఆ కూలిన యిల్లంతా గాలించి చూచాడు వర్తకుడు. ముల్లా రహస్యం బయటపడ్డది. 40 దీనారాలు దొరికినాయి వర్తకునికి దొరికిన సొమ్ము మూటగట్టుకొని గపుచిపుగా వెళ్ళిపోయినాడు వర్తకుడు. తెల్లవారివచ్చి ముల్లా తననిధిని చూచుకున్నాడు. ఒక్క దీనారమూ కూడాలేదు. ఆలోచనలో పడ్డాడు ముల్లా—"ఇది ఎవరిమాయ కావచ్చు?" చాలసేపు ఈప్రశ్న అతణ్ణి పీడించింది. "ఆ తరవువాడు ఒకడే నా రాకపోకలు చూస్తున్నాడు—వాడికి తప్ప మరోపక్షికి తెలియదు నారహస్యం. సరే! చూద్దాము...వాడు ఏపాటి ఘనుడో" అని నిమ్మళంగా ఆ తరవు వర్తకుని దగ్గరికిపోయి కొంచెం ఈలెక్క చేసిపెట్టండి అని అడిగాడు.

వర్తకుడు "సరే" అన్నాడు.

"నలుబయిదీనారాల్లో యిరువయికలిపితే ఎన్ని అవుతా" యన్నాడు ముల్లా.

"అరువయి" అన్నాడు వర్తకుడు.

"మరో ముప్పయి కలిపితే?"

"తొంబయి"

"ఆ తొంబయిలో మరో నాల్గు కలిపితే?"

"తొంబయినాలుగు" అన్నాడు వర్తకుడు. సరే! మీ శ్రమకు దండాలు అంటు ముల్లా వెళ్లి పోవడంతోనే వర్తకుడు ఆలోచనలోపడ్డాడు. "యింకా ఎక్కడో వీడు యాబయినాల్గు దీనారాలు దాచి పెట్టినట్టుగా ఉంది. ఈ వెధవ ఆ దీనారాలన్నీ ఆ పాతరలోనే వేస్తాడు గావును? తీరా పాతర తీసే సరికి యిదివరకు దాచిన ధనము లేకపోతే-?—నేను తొందరపడి పాతర పెల్లగించాను ఏమి మునిగింది తొందరపడటానికి? వాడు కూడికచేసే ధనమంతా ఒకేసారి సంగ్రహిస్తే పోతుంది" అని తాను యిదివరకు సంగ్రహించిన ధనమంతా పాతరలో వేసివచ్చాడు. తెల్లవారి ముల్లాపోయి పాతర చూచుకున్నాడు. తన 40 దీనారాలు మెరుస్తూ కనుపించాయి. "పాచిక పారిందిరా" అని ఆ దీనారాలన్నీ మూటగట్టుకొని ఆ తరవు వర్తకుడు చేసిన మేలుకు అతన్ని ఒకసారి పొగడి యింటికి వెళ్ళిపోయాడు.

# ★ యానం ★

నేను ప్రయాణం చేయా లనుకున్నాను.

నడవగా, నడవగా, ఒక నది వచ్చింది.

ఆ నదిని దాటటం ఎలాగా అనుకున్నాను.

నదిలో ఓ పెద్ద చెట్టు కొట్టుకొస్తోంది. అది నా సమీపంలో గట్టు తగిలి ఆగింది.

నేను దానిమీద ఎక్కి కూర్చున్నాను. అది బలే సరదాగా నీళ్లల్లో ప్రయాణం చేసింది.

ఒకచోట కొందరు మనుష్యులు నా చెట్టును, ఆపు చేశారు.

నేను ఒడ్డుకు దూకాను. వారితో నేను ప్రయాణం చేయాలి, అని చెప్పాను.

వాళ్లు నాకు వెదురు బొంగులతో కట్టిన తెప్ప చూపారు. దానిమీద ఎక్కాను. ఒకడు, గెడ కర్రతో దాన్ని జాగ్రత్తగా నడిపాడు.

కొంతదూరం పోయాక, మాకు ఓ ఒడ్డు తగిలింది.

అక్కడ, వొలిచిన చెట్లలాంటివి ఉన్నాయి. ఆ దోనెల్లోకి ఎక్కాము. 'రంయ్'మంటూ నదిలో పోనిచ్చాడు.

కొంతదూరం పోయాక, తెల్లటి గుడ్డ తెరలు అగుపించాయి. వాటిని కల్సుకున్నాను. ఆ పడవల్లోకి ఎక్కాను. లోన గదు లున్నాయి. తెర చాప గాలిలో, పడవ రివ్వున కదిలింది!

కొంతదూరం పోయాక, నదిలో పొగలొచ్చాయి. కూతలుకూడా వినపడ్డాయి. ఏమిటా అని చూశాను. పడవలాగే ఉంది. అందులోకి దూకాను.

ఇంజనుతో, రివ్వు రివ్వున పరుగెట్టింది.

ఇంతట్లో, సముద్రం అడుగున శబ్దం అయింది. హాయ్! 'సబ్ మెరీనట! అందులోకి దిగాను. నీటిలో రయ్‌మంటూ పరుగెట్టింది. ఎంత హాయిగా వుందని!

హాయిగానే వుందండి — పైనుంచి బాంబుల వర్షం కురిసి శాశ్వతంగా నీట మునిగేవరకూ!

—రచన : జి. ప్రభ.